# ప్రజాఆశీర్వాద సభను విజయవంతం చేద్దాం



అచ్చంపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

లింగాల, అక్టోబర్ 25 : అచ్చంపేట పట్టణంలో ఈ నెల 26న గురువారం సీఎం కేసీఆర్‌చే ప్రజాఆశీర్వాద భారీ బహిరంగసభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుధీర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ మాకం తిరుపతయ్య, జిల్లా నాయకులు కేటీ తిరుపతయ్య బుధవారం మండల ప్రజలను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ అచ్చంపేట పట్టణంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే ప్రజాశీర్వాద సభకు నలుమూలల నుంచి బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

### అధికసంఖ్యలో తరలిరావాలి

ఉప్పునుంతల, అక్టోబర్ 25 : అచ్చంపేట పట్టణంలో గురువారం నిర్వహించే ప్రజాఆశ్వీరాద సభకు మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిరాశులు, ప్రజలు భారీ సంఖ్యలో హాజరుకావాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రావు బుధవారం ప్రకటనలో కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించే ఈ సభకు ముఖ్యఅతిథిగా సీఎం కేసీఆర్ హాజరవుతున్నారన్నారు.అదే విధంగా మండల కేంద్రం నుంచి అధికసంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు తరలి రావాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు.

### సభ విజయవంతం చేయాలని ఇంటింటి ప్రచారం ..

అచ్చంపేట రూరల్, అక్టోబర్ 25 : ఈ నెల 26 వ తేదీన జరిగే అచ్చంపేట ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో పాటు సీఎం కేసీఆర్, విప్ గువ్వల చిత్రపటాలతో కూడిన కరపత్రం, అచ్చంపేట అభివృద్ధి వివరాలతో కూడిన ప్రజలకు వివరించి సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ సిద్ధించాక జరిగిన అభివృద్ధి రాబోవుకాలంలో మ్యానిఫెస్టోలో పొందుపర్చిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. మరోసారి అచ్చంపేట గడ్డపై గులాబీ జెండాను ఎగురవేసేందుకు సీఎం కేసీఆర్ అచ్చంపేట నల్లమల ప్రాంతానికి మరిన్ని వరాల జల్లులు కురిపిస్తాడని, మండలంలోని 38 గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో సీఎం కేసీఆర్ ప్రజాశీర్వాద సభకు వేలాదిగా తరలిరావాలని బీఆర్ఎస్ మండలాధ్యాక్షుడు పర్వతాలు పిలుపునిచ్చారు. అదేవిధంగా పట్టణంలోని 5వ వార్డులో ఆకుల శ్రీనివాసులు, శేఖర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి సీఎం సభను విజయవంతం చేయాలని కోరారు.

### వంగూరులో

వంగూరు, అక్టోబర్ 25 : అచ్చంపేటలో నేడు సీఎం కేసిఆర్ పాల్గొనే ప్రజాఆశీర్వాద సభకు పెద్దెత్తునా బీఆర్ఎస్ శ్రేణులు తరలిరావాలని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంపీపీ భీమమ్మ లాలుయాదవ్‌లు బుధవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. ప్రతిగ్రామం నుంచి పెద్దెత్తునా ప్రజలను తరలించే విధంగా ప్రజా ప్రతినిధులు, నాయకులు కృషి చేయాలని వారు కోరారు. ఉదయం 9 గంటలకే గ్రామాల నుంచి ప్రజలు అచ్చంపేటకు తరలి వచ్చేలా చూడాలని నాయకులకు వారు సూచించారు.

# ఘనంగాఅమ్మవారి గ్రామోత్సవం

అచ్చంపేట టౌన్, అక్టోబర్ 25 : పట్టణంలో వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన దుర్గా నవరాత్రి ఉత్సవాలు ఎంతో ఘనంగా అంగరంగ వైభవంగా జరిగాయి. బుధవారం వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన దుర్గా అమ్మవారులను ట్రాక్టర్ పై వివిధ రకాల పుష్పాలతో, విద్యుత్ కాంతుల నడుమ అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. ఆలయం నుంచి కలశంను తీసుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రతి కూడలిలో కోలాటాలతో, వీరభద్రుని ఖడ్గాల నడుమ, ఆర్యవైశ్యులు ఒకే రకమైన వస్త్రధారణతో చూపరులను కనువిందు చేశాయి. అదేవిధంగా అమ్మవారికి అలంకరించిన చీరలు వేలంపాట భక్తులు అధికంగా పాల్గొని చీరలకు దక్కించుకున్నారు. అనంతరం దేవాలయం ఉత్తర భాగమువైపున ఉన్న ఖాళీ స్థలంలో అగ్నిగుండంను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కొరివి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి బాలరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



బతుకమ్మలతో సందడి చేసిన మహిళలు



అచ్చంపేటలోఅమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

### బతుకమ్మ సంబురాలు

అచ్చంపేట టౌన్, అక్టోబర్ 25 : అచ్చంపేట పట్టణంలోని భ్రమరాంబ ఆలయం నుంచి బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం పట్టణంలోని మహిళలు వివిధ రకాల పుష్పాలతో, తీరొక్క పూలతో బతుకమ్మను అలంకరించి గౌరమ్మను పూజించారు. వివిధ కూడలిలో బతుకమ్మ ఆటపాటలతో చూపరులను కనువిందు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# పాతఅనుచరులకే కండువాలు కప్పేతున్న జూపల్లి !

- ప్రజల దృష్టిని మళ్లించేందుకు పాకులాడుతున్న మాజీ మంత్రి

కొల్లాపూర్, అక్టోబర్ 25: బీఆర్ఎస్ నుంచి బహిష్కరణకు గురై ఇటీవల కాంగ్రెస్‌పార్టీలో చేరిన మాజీ మంత్రి జూపల్లికృష్ణారావు తన పాతఅనుచరులు, అభిమానులకే హస్తం పార్టీ కండువాలను కప్పుతూ ప్రజలదృష్టిని మళ్లించేందుకు కొత్త గేము లకు మాజీ మంత్రి జూపల్లి తెరలేపారు. కొత్తగా ఇతర పార్టీల నుంచి భారీగా హస్తం పార్టీలో చేరుతున్నట్లు అభూతకల్పనతో సోషల్ మీడియాల్లో వింత ప్రచారాలకు పాల్పడుతున్నారు. జూపల్లి తంతును పరిశీలిస్తే 'పాత సీసాలో కొత్తసారా, అన్న చందంగా ఉందని జూపల్లి వ్యతిరేక వర్గీయులు విమర్శిస్తున్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో ఏదో ఒక గ్రామంలో తమ సొంత పనులను చేయలేదనో, లేక తమ గొంతెమ్మ కోర్కెలను తీర్చలేదనో అసంతృప్తికి గురై అక్కడక్కడ ఒక్కరిద్దరూ అధికార పార్టీని వీడితే దాన్ని 'గోరంతలను కొండంతలుగా, ప్రచారం చేసుకోవడం 'మాజీ మంత్రికి పరిపాటేనని అంటున్నారు. గ్రామాలకు వెళ్తూ 'మాజీ మంత్రి, తన అనుచరవర్గీయులకు కాంగ్రెస్ కండువాలను కప్పుతూ ఇతర పార్టీల నుంచి చేరుతున్నట్లు కట్టుకథలతో ప్రజల దృష్టిని మళ్లించేందుకు తన వర్గీయులు ప్రాకులాడుతున్నారని రాజకీయ ప్రత్యర్థి వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఉన్నట్టుగా, ఉన్నది లేనట్టుగా అభూతకల్పన సృష్టించడంలో 'మాజీ, దిట్టని వారు గతాన్ని గుర్తు చేస్తున్నారు. కాంగ్రెస్‌లోని వర్గపోరుతో విసిగిచెంది ఆ పార్టీ శ్రేణులు రోజురోజుకీ గులాబీ దండులోకి వలసకడుతున్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో తాజాగా బుధవారం టికెట్ ఆశించి భంగపాటుకుగురైన కాంగ్రెస్ నాయకుడు చింతలపల్లి జగదీశ్వర్‌రావు ముఖ్య అనుచరులు వీపనగండ్ల మండలం గోపల్‌దిన్నె గ్రామానికి చెందిన 25మంది పట్టణంలో క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌డ్డి సమక్షంలో చేరారు. గత 19 ఏండ్లుగా ఎమ్మెల్యేగా, అనేక మంత్రి పదవులను ఒరగబెట్టి నియోజకవర్గంలో ఏ మేరకు అభివృద్ధి చేశారని, జూపల్లి అభ్యర్థిత్వాన్ని ఎలా బలపర్చాలంటూ జగదీశ్వర్‌రావు వర్గీయులు గులాబీ దండులోకి చేరుతున్నారు. దీన్ని జీర్ణించుకోలేని మాజీ వర్గీయులు వార్ వన్‌సైడేనన్న అభూతకల్పనతో దుష్ప్రచారాలు చేస్తూ హస్తం పార్టీలో కృత్రిమ చేరికలను సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడానికి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. గతంలో మంత్రిగా ఉన్నప్పుడు రెవిన్యూ డివిజనల్ కార్యాలయం కొల్లాపూర్‌లో ఏర్పాటు వద్దంటూ, పట్టణంలో ఎన్టీఆర్ చౌరస్తాలో తన అనుచరవర్గీయులతో కృత్రిమ ఉద్యమం చేయించిన విషయాన్ని బీఆర్ఎస్ నాయకులు గుర్తు చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్తగా యువతరం రాజకీయ ఆరంగ్రేటం చేస్తుండడంతో తాను ఏదీ చెప్పినా ఎప్పుడూ తనదే నెగ్గుతుందన్న భ్రమను వీడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలు ప్రజా సంఘాల నాయకులు అంటున్నారు. ఏది చేసినా నిజాలు నిలకడగా తెలుస్తుందని వారంటున్నారు. ఇతర పార్టీలోని ముఖ్యులకు గుట్టుగా నజరానాలు ముట్టచెప్పుతూ హస్తం పార్టీ జెండా కండువాలను కప్పుతున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

## దుర్గామాత చీరలువేలం



దుర్గామాత చీరలతో మహిళలు

అచ్చంపేట రూరల్, అక్టోబర్ 25 : దసరా పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని దుర్గామాత నవరాత్రులలో పూజలందుకున్న చీరలను మండలంలోని సింగారంలో మంగళవారం రాత్రి చీరలను వేలం నిర్వహించగా మొదటిచీర ఎడ్మ సరిత రూ.9వేలు, రెండోచీర సాటు పార్వతమ్మ 8వేలు, మూడోచీర రాత్లవత్ తిరుపతమ్మ రూ.6 వేలు, నాల్గో చీర లక్ష్మి రూ.6,500, ఐదవ చీర చంద్రమ్మ రూ.8వేలు, ఆరోచీర కొండేమోని లక్ష్మమ్మ రూ.15వేలు, ఏడోచీర రామలక్ష్మమ్మ రూ.12,500, ఎనిమిదవ చీర కొర్ర మానస రూ.8,500, తొమ్మిదో చీర గండికోట తిరుపతమ్మ రూ.9వేలు, బంగారు ముక్కుపుడుక అనితబక్కయ్య రూ.22వేలు బహిరంగ వేలం పాటలో దక్కించుకొని ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి వేలంలో దక్కిన చీరలను మహిళలు స్వీకరించారని దుర్గామాత అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

## 'మేరీ మిట్టి-మేరా దేశ్' కోసం మట్టికలశాల సేకరణ




ఎంపీడీవో కార్యాలయం వద్ద మట్టి కలశాలను సేకరిస్తున్న ఎన్వైకే సిబ్బంది

వంగూరు, అక్టోబర్ 25 : మేరీ మిట్టీ-మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అధికారులు సేకరించిన మట్టి కలశాలను సేకరించారు. అనంతరం మేరీ మట్టీ-మేరా దేశ్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం ఉమ్మడి జిల్లా అధికారి కోటానాయక్, ఎన్వైకే వలంటీర్లు శివకుమార్, ఆనీపుద్ధీన్‌తో పాటు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలే గెలుపునకు నాంది

బల్మూరు, అక్టోబర్ 25 : తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలే గెలుపునకు నాంది కావడం జరుగుతుందని బీఆర్ఎస్ నాయకులు ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ లక్ష్మి, విండోచైర్మన్ నర్సయ్య, రాజేందర్‌గౌడ్, ప్రేమ్‌రావు, సూల్తాన్, చందు, ముస్తాక్, శ్రీను, నిరంజన్‌లు బుధవారం అన్నారు. అచ్చంపేట ఎమ్మెల్యేగా ముచ్చటగా మూడోసారి గువ్వల బాలరాజు గెలువడం ఖాయమన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికుట్రలు చేసిన గువ్వల గెలుపును ఎవరు అపలేరని వారు సూచించారు.

## అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

పెద్దకొత్తపల్లి, అక్టోబర్ 25: మండల పరిధిలోని దేదినేనీపల్లి గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కొరకు ఆ గ్రామ సర్పంచ్ రజిత బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కొరకు భూమి పూజ చేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కృష్ణ ఆ గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు.

## తనిఖీలో రూ.96 వేల నగదు పట్టివేత



తనిఖీలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

వీపనగండ్ల, అక్టోబర్ 25 : మండలంలోని సంగినేనిపల్లి గ్రామ శివారులో వాహనాల తనిఖీలో రూ.96వేల నగదు పట్టుకున్నట్లు ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ రవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగినేనిపల్లి నుంచి వీపనగండ్లకు వెళ్తున్న ఏపీఆర్7719 నెంబర్‌గల ఇండికాకారుపై అనుమానంతో తనిఖీ చేశారు. మండల కేంద్రానికి చెది అల్లె కురుమయ్య వద్ద రూ.96 వేలు గుర్తించారు. సంబంధిత ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రవిప్రకాశ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.